



ఇందిరమ్మ కాలనీలో పునాదులను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

సొంతింటి కల పునాదులకే పరిమితమా ?

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

'పేదల సొంతింటి కల.. కలగానే మిగిలింది. ఇంటి నిర్మాణ పనులకు అవసరమయ్యే సిమెంటు, స్టీల్, ఇసుక ధరలు చుక్కలను చూపిస్తున్నాయి. ప్రభుత్వం లబ్ధిదారులకు ఇచ్చే రూ.1.80 లక్షల సబ్సిడీ ఇంటి నిర్మాణ పనులకు ఏమాత్రం సరిపోవడం లేదు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఇళ్లు నిర్మించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది'..అని సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ అన్నారు. శనివారం తాడిపత్రి మండలం సజ్జలదిన్నె గ్రామ సమీపంలో చేపట్టిన జగనన్న కాలనీలను సిపిఎం నాయకులు రాంభూపాల్ పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న లబ్ధిదారులతో మాట్లాడారు. పేదవాడికి జీవనమే కష్టమైన పరిస్థితులలో జగనన్న సొంతింటి కల అనే పథకం ద్వారా ఇళ్లు నిర్మిస్తానని చెప్పారన్నారు. ఈ సొంతింటి నిర్మాణానికి ప్రభుత్వం లబ్ధిదారులకు ఇస్తున్న రూ.1.80 లక్షలు ఎందుకూ సరిపోవడం లేదన్నారు. కేవలం పునాదిని మాత్రమే నిర్మించుకోగలుగుతున్నారన్నారు. ఇల్లు పూర్తయ్యేసరికి రూ.5 నుంచి రూ.10 లక్షలు దాకా ఖర్చవుతుందన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో అప్పులు తెచ్చి ఇల్లు నిర్మించుకోవడం కష్టంగా మారుతోందన్నారు. ప్రభుత్వమే పేదలకు ఇళ్లు నిర్మించి వెంటనే ఇవ్వాలని, లేనిపక్షంలో రూ.5 లక్షలు లబ్ధిదారులకు మంజూరు చేయాలని, కాలనీలకు కనీస వసతులను కూడా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జగన్ మోహన్ రెడ్డి, నాగరాజు, పూసల సంఘం నాయకులు చంటి తదితరులు పాల్గొన్నారు.

కోటి ఆశలతో.. సరికొత్త స్వాగతం..2023

- బై బై 2022... వెల్‌కమ్ 2023..!
- పెద్దగా కలసిరాని 2022
- కొంగొత్త ఆశలతో కొత్త ఏడాదిలోకి..

కాలగమనంలో మరో సంవత్సరం కలిసిపోయింది. 'కొత్త'ఆశలు మొలకెత్తాయి... ఆకాంక్షలు ఊగిసలాడాయి... వ్యాపకాలు దారి మార్చుకున్నాయి. సాధ్యాసాధ్యాలను పక్కనపెడితే మనుసు కొత్త ఉత్సాహంతో సందడి చేసింది. కొత్త కాంతులు, కోటి ఆశలతో 'న్యూ'తనోత్సాహం నెలకొంది. 2022కు వీడ్కోలు చెప్పి 2023కు స్వాగతం పలుకుతూ అందరిలోనూ జోష్ కన్పించింది. గతేడాది కష్టాలను ఓ జ్ఞాపకంగా వదిలేసి... ఆశల అడుగులు ఆగకుండా గుండెనిండుగా 2023కు జిల్లా వాసులు స్వాగతం పలికారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

2022 సంవత్సరంలోని చేదు, తీపి జ్ఞాపకాలకు వీడ్కోలు పలుకుతూ కొంగొత్త ఆశలతోనూ ఆశయాలతో 2023కు స్వాగతం పలికారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే కార్యక్రమాలు శనివారం రోజు ఉత్సహపూరితంగా జరిగాయి. అర్ధరాత్రి 12 గంటలకు కొత్త సంత్సరానికి స్వాగతం పలికేందుకు పెద్దఎత్తున కేకులు, మిఠాలను కొనుగోళ్లతో శనివారం మధ్యాహ్నం నుంచి నగరాలు, పట్టణాల్లో సందడి నెలకొంది. సాయంత్రం నుంచి స్నేహితులు, సన్నిహితులు వారికి అనువైన ప్రాంతాల్లో వీడ్కోలు సంబరాలు జరుపుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు కేకులు కట్ చేసి కొత్త ఏడాది స్వాగతం పలికే కార్యక్రమాలు జోరుగా సాగాయి.

పెద్దగా కలసిరాని 2022

నిన్నటితో ముగిసిన 2022 సంవత్సరం పెద్దగా కలసిరాలేదనే చెప్పాలి. 2021 తరహాలో కోవిడ్ 2022 పెద్దగా ఇబ్బంది పెట్టకపోవడం సంతోషించదగ్గ అంశంగా చెప్పుకోవచ్చు. అనేక ఆంక్షల నడుమనే 2022 సంవత్సర వేడుకలు జరిగాయి. కాని ఆ తరువాత కోవిడ్ ప్రారంభం తగ్గింది. అంతక మునుపు కోవిడ్ సమయంలో విధించిన లాక్‌డౌన్‌ల కారణంగా మొదలైన ఆర్థిక కష్టాలు సామాన్యులను ఈ ఏడాది వెంటాడాయి. దీంతో అనేక మంది చిరు వ్యాపారులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఇప్పటికీ ఆ బాధలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రపంచాన్ని చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం ప్రారంభం ఇప్పటికీ కొనసాగుతూనే ఉందని ఆర్థిక నిపుణులు సైతం చెబుతున్నారు. ఈ ప్రభావాలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. కొత్త సంవత్సరంలోనైనా ఆర్థిక ఇబ్బందులు తొలగి తిరిగి సామాన్యుడి జీవనం పట్టాలెక్కుతుందన్న ఆశాభావం అందరిలోనూ ఉంది.

అధిక వర్షాలతో రైతుకు తీరని నష్టం

ఈ ఏడాది ప్రకృతి తోడ్పాటు అందించినట్టు కనిపించింది. వర్షాలు బాగాపడినప్పటికీ అధిక వర్షాలతో రైతులకు తీరని నష్టమే మిగిలింది. వర్షం కోసం ఎప్పుడూ ఆకాశం వైపు ఎదురు చూసే జిల్లా రైతాంగానికి 2022లో అధిక వర్షాలతో ఇబ్బందులు పడ్డారు. అనంతపురం జిల్లా సాధారణ వర్షపాతం 459 అయితే ఈ ఏడాది 647 మిల్లీమీటర్లు నమోదయ్యింది. సత్యసాయి జిల్లా సాధారణ వర్షపాతం 527 మిల్లీమీటర్లు అయితే పడిన వర్షపాతం 789 మిల్లీమీటర్లు రెండు జిల్లాలోనూ సాధారణం కంటే 40 శాతం అధికంగా వర్షాలు పడ్డాయి. ఈ వర్షాలతో గతంలో ఎన్నడూలేని విధంగా అన్ని ప్రాజెక్టులు పొంగి ప్రవహించాయి. సుమారు వంద టిఎంసిల వరకు నీరు జిల్లా నుంచి వరద రూపంలో దిగువకు పోయింది. ఎప్పుడూ ప్రాజెక్టుల్లో నీళ్ల కోసం ఎదురుచూసేవాళ్లు. ఈసారి మాత్రం పెన్నా, చిత్రావతి నదులు సైతం పొంగి ప్రవహించాయి. ఈ అధిక వర్షాలతో వేరుశనగ, పత్తి, మిరప పంటల రైతులు తీవ్రంగా నష్టపోయారు.

రాజకీయ వేడి

2022 రాజకీయ వాతావరణం వాడీవేడిగానే సాగాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధాలు సాగాయి. టిడిపి, వైసిపి నేతల మధ్య మాటల యుద్ధాలు సాగాయి. తాడిపత్రి, రాప్తాడు, రాయదుర్గం, కళ్యాణదుర్గంల్లో ఇవి తారా స్థాయిలో నడిచాయి. హిందూపురంలో రామకృష్ణారెడ్డి హత్య వైసిపిలో గ్రూపు తగాదాలను బయటపెట్టాయి. ఎమ్మెల్సీ ఇక్బాల్‌పైనే ఆరోపణలు వెల్లువెత్తాయి. హిందూపురం పార్లమెంటు సభ్యులు గోరంట్ల మాధవ్ అశ్లీల వీడియోలు రాష్ట్ర స్థాయిలో దుమారం రేపాయి. ఈ అంశంపై రాష్ట్ర స్థాయిలోనే అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధంత రాజకీయ వాతావరణం వేడెక్కింది.

తగ్గిన నేరాలు

రెండు జిల్లాల పరిధిలో నేరాల సంఖ్య ఈఏడాది తగ్గినట్టు ఎస్పీలు డాక్టర్ కె.ఫక్కీరప్ప, రాహుల్‌దేవ్ సింగ్‌లు తెలిపారు. నేరాల సంఖ్య తగ్గినప్పటికీ మహిళలపై హింస శాతం మాత్రం తగ్గలేదు. మరింత పెరిగింది. అదే సమయంలో సైబర్ నేరాల సంఖ్య కూడా పెరగడం గమనార్హం. రహదారి ప్రమాదాలు తగ్గాయి. ముఠా కక్షలు కూడా ఈ సంవత్సరం చోటు చేసుకోకుండా పోలీసు శాఖ గట్టి చర్యలు చేపట్టింది.

రెండు జిల్లాల ఏర్పాటు

రాష్ట్ర ప్రభుత్వం 2022వ సంవత్సరంలో జిల్లాల విభజన చేపట్టింది. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లా రెండుగా ఏర్పాటైంది. అనంతపురం జిల్లాగా 31 మండలాలతో ఏర్పాటవగా, సత్యసాయి జిల్లా 32 మండలాలతో ఏర్పాటైంది. మార్చి నెల నుంచి ఈ విభజన జరిగి ఆయా ప్రాంతాల నుంచి కార్యకలాపాలు మొదలయ్యాయి. కొత్త జిల్లా ఏర్పాటైనప్పటికీ ఇప్పటికీ అనేక బలారిష్టాలు మాత్రం కొత్త జిల్లాకు తొలగలేదు. పూర్తి స్థాయి కార్యాలయాల ఏర్పాట్లు పూర్తవలేదు. ఉన్న అరకొర సౌకర్యాలతోనే అక్కడి కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.





గౌరీ థియేటర్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న సినీ దర్శకుడు భరత్ కోమలపాటి

అనంతలో దర్శకుడు భరత్ కోమలపాటి సందడి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

అనంతపురంలో ఎస్-5 నో ఎగ్జిట్ చిత్రం దర్శకుడు భరత్ కోమలపాటి సందడి చేశారు. శనివారం గౌరీ థియేటర్లో మీడియా సభ్యులతో మాట్లాడారు. తాను అనంతవాసినేనని డ్యాన్సర్‌గా రాణించి, ఎస్-5 మొదటి చిత్రానికి దర్శకుడుగా వహించానని చెప్పారు. ఈ చిత్రం రాష్ట్రంలో 200 థియేటర్లలో ప్రదర్శించబడుతుందని తెలిపారు. ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందన్నారు. అనంత గడ్డపై తనకు ఎన్నో మరపురాని జ్ఞాపకాలు ఉన్నాయన్నారు. దర్శకుడిగానే రాణించి మరిన్ని మంచి చిత్రాలు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. అనంతకు వచ్చిన ఆయనకు డిప్యూటీ మేయర్లు విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రాయల్ మురళీమోహన్ అభినందనలు తెలిపారు. వీరితోపాటు శేఖర్ నాయుడు, చంద్రకళ అంజలి సుధాకర్ బాబు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక శిల్పారామంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు పరిపాలన అధికారి కృష్ణ ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ సంస్కృతికి, సంప్రదాయాల సమాహారం శిల్పారామంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు విభిన్నమైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శాస్త్రీయ నృత్యం, సినీ నృత్యాలు, కామెడీ స్కిట్స్, జానపద కళారూపాల ప్రదర్శన, పిల్లన గోవి, దాండియా నృత్యం వంటి కార్యక్రమాలను నిర్వహించి ప్రతిభ కనబరచిన వారికి ప్రథమ, ద్వితీయ, తతీయ ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని చెప్పారు. శిల్పారామంలో ప్రత్యేక ఆకర్షణగా వివిధ రకాలైన కొండపల్లి బొమ్మలు, జనపనార సంచులు, ప్రత్యేకంగా మహిళలకు చార్మినార్ గాజులు, నక్క గాజులు, రాతి కంకణాలు, ఇక్కత్ బ్యాగ్స్, పాదరక్షలు, మొబైల్ పర్సులు, చెక్క గొలుసులు అమ్మకానికి ఏర్పాటు చేస్తామన్నారు. వీటితోపాటుగా బోట్ షికారు, జెయింట్ వీల్, వాటర్ బ్యాగ్, బ్రేక్ డాన్స్ మొదలగు వినోద భరితమైన గేమ్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అనంతపురంలోని శిల్పారామం

జిల్లా హాకీ జట్టుకు పాల్తూరు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-ఉరవకొండ

జిల్లా స్థాయి హాకీ జట్టు ఎంపిక పోటీలను పాల్తూరు ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హాకీ అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాలబాలికలు ఎంపిక చేశారు. ఈ పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాల నుండి అనేకమంది హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు. పాల్తూరు పాఠశాల నుండి 12 మంది జిల్లా హాకి జట్టుకు ఎంపిక చేశారు. అండర్ 17 బాలుర విభాగంలో అభిషేక్, శశిధర్, సుధాకర్, అండర్ 17 బాలికల విభాగంలో మేఘన, భాను, గీత అండర్ 14 బాలుర విభాగంలో కుమార్‌స్వామి, నందకిషోర్, అండర్ 14 బాలికల విభాగంలో శశికళ, పద్మ, ప్రియాంక జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. వారు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సర్వమంగళం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులతో పాఠశాల ఉపాధ్యాయులు

ఇకనైనా తప్పుడు పనులు మానుకో

విప్ కాపు రామచంద్రారెడ్డికి మాజీ మంత్రి కాలవ హితవు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం ఎమ్మెల్యే, విప్ కాపు రామచంద్రారెడ్డి కొత్త సంవత్సరం నుంచైనా తప్పుడు పనులు చేయడం, తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు సూచించారు. శనివారం రాయదుర్గంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో కాలవ మాట్లాడుతూ రామచంద్రారెడ్డి తప్పుడు పనులు చేసి, కోట్ల రూపాయల ప్రజా ఆస్తులను స్వాహా చేసి, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నుల రాయితీలు ఎగ్గొట్టి తనపై, తెలుగుదేశం పార్టీపై అవాకులు చవాకులు పేల్చుతున్నారన్నారు. నేరాలు చేయడం అలవాటుగా చేసుకుని మూడున్నర సంవత్సరాలలో కాపు పెద్ద ఎత్తున ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నారన్నారు. కొందరు విలేకరులు- ఏబీఎన్, ఆంధ్రజ్యోతి విలేకరులపై తాను దాడి చేయిస్తానని తనపై అభియోగం చేసినట్లు ఆరోపించారు. పాతికేళ్లుగా రాజకీయాల్లో ఉన్న తాను ఎన్నడూ ఎవరిపై దాడి చేయించలేదన్నారు. అలాంటి వాటికి తాను వ్యతిరేకం అన్నారు. రామచంద్రారెడ్డి తన గన్‌మెన్‌లను బలవంతంగా వెనక్కి పంపారని వార్తలు మీడియాలో వచ్చాయన్నారు. అతను ఫ్రస్ట్రేషన్‌లో ఉండి రాజకీయ భవిష్యత్తు లేదని, గడప గడపకు కార్యక్రమంలో భాగంగా బిటి ప్రాజెక్టు వద్ద మూర్తి అనే టిడిపి కార్యకర్తను బెదిరించి అతనిపై హత్యాయత్నం కేసు పెట్టించారన్నారు. డి.హీరేహాల్లో కాపు అనుచరుడు వసంతను దొంగనోట్ల కేసులో పోలీసులు అరెస్టు చేసి విచారణ చేశారన్నారు. అతడు అక్రమ ఆయుధాల కేసులో నాలుగైదు రాష్ట్రాల్లోని వ్యక్తులతో సంబంధాలు ఉన్నాయని విచారణలో వెలుగు చూసిందన్నారు. కాపు కనుసన్నల్లో ఇవన్నీ జరుగుతున్నాయని అనుమానం వ్యక్తం చేశారు. వసంతతో తనకు సంబంధాలు లేవని, అక్రమ ఆయుధాల రవాణా, నకిలీ నోట్ల కేసులో తమ ప్రమేయం లేదని కాపు ఖండన కూడా ఇవ్వలేదన్నారు. తమ కార్యకర్త నవీన్ అక్రమ మద్యం కేసులో పట్టుబడినట్లు తెలిస్తే వెంటనే అతడిని పార్టీ నుండి బహిష్కరించామని చెప్పారు. కాపు అనుచరుడు కాంతారెడ్డి తోటలో 55 పెట్టెలలో 5250 మద్యం ప్యాకెట్లను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేస్తే అతన్ని పార్టీ నుండి ఎందుకు సస్పెండ్ చేయలేదని ప్రశ్నించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాయదుర్గం అసెంబ్లీ టికెట్ తనదేనని, తానే అభ్యర్థినని కాలవ స్పష్టం చేశారు. మరి వైసిపి తరపున తానే అభ్యర్థినని ప్రకటించే ధైర్యం కాపు రామచంద్రారెడ్డికి ఉందా అని నిలదీశారు. కొత్త సంవత్సరంలోనైనా బుద్ధి, జ్ఞానంతో వ్యవహరించాలని హితవు పలికారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు మహబూబ్ బాషా, పురుషోత్తం, తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజల్లో ఆదరణ లేకే విమర్శలు : ఎమ్మెల్యే అనంత



కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనంత

ప్రజాశక్తి -అనంతపురం

తెలుగుదేశం పార్టీకి, ఆ పార్టీ నాయకులకు ప్రజల్లో ఆదరణ లేకపోవడం వల్లే తమపై విమర్శలు చేస్తున్నారని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. టీడీపీ నేతలు చేస్తున్న బాదుడే బాదుడు.. ఇదేం ఖర్మ కార్యక్రమాలకు ప్రజల నుంచి స్పందన రావడం లేదన్నారు. అందుకే వాలంటీర్లతో ప్రజలను బెదిరిస్తున్నారని సిగ్గులేకుండా కొందరు విమర్శిస్తున్నారని మండిపడ్డారు. వాలంటీర్లతో బెదిరించాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేశారు. టీడీపీని, ఆ పార్టీ నాయకులను ప్రజలు విశ్వసించడం లేదని.. అందుకే వారితో ప్రజలు వెళ్లడం లేదన్నారు. కుట్రలు, కుయుక్తులు చేసి అధికారంలోకి రావాలన్నదే వారి తాపత్రయమని అన్నారు. శనివారం నగరంలోని 48వ డివిజన్‌లో కార్పొరేటర్ శ్రీనివాసులుతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు అందజేశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమమే పరమావధిగా తాము ముందుకెళ్తున్నామన్నారు. ఆదరణ లేని నాయకులే వాళ్ల చేపట్టిన కార్యక్రమాలకు స్పందన లేదని గుర్తించి తమపై విమర్శలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు : జెడ్‌పిటిసి చంద్రకుమార్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో అనేక గొప్ప సంస్కరణలు తీసుకువచ్చి పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని అనంతపురం రూరల్ మండల జెడ్పీటీసీ జూటూరు చంద్రకుమార్ పేర్కొన్నారు. రూరల్ మండల పరిధిలోని కురుగుంటలోని ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు శనివారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనంతపురం రూరల్ మండల జెడ్పీటీసీ జూటూరు చంద్రకుమార్, ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, డీసీవో బాలాజీ నాయక్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ చంద్రకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ, ఎక్కడా జరగని విధంగా విద్య వైద్యానికి సిఎం జగన్మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. విద్యా వ్యవస్థలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్యను అందించాలన్న గొప్ప సంకల్పంతో సీఎం జగన్ ముందుకుపోతున్నాడని తెలిపారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం మరింత చేరువచేయడం కోసం ప్రభుత్వం వినూత్నంగా ఆలోచించి ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులకు ఆ తరగతులను బోధించే ఉపాధ్యాయులకు ట్యాబులు పంపిణీ చేస్తోందన్నారు. కురుగుంట గురుకుల పాఠశాలలో 89 ట్యాబ్‌లు విద్యార్థులు, ఉపాధ్యాయులకు పంపిణీ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.సునీత, కురుకుంట సర్పంచి లక్ష్మిదేవి, ఉప సర్పంచి మాధవరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ ముస్తఫా, మాజీ ఎంపీటీసీ కిరణ్, వైసీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పంపిణీ చేసిన ట్యాబ్‌లతో విద్యార్థినులు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

బొమ్మనహాల్ : ప్రజాశక్తి 2023 నూతన క్యాలెండర్‌ను స్థానిక తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు, రెవెన్యూ సిబ్బంది చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ.. రంగు రంగులతో ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆకర్షణీయంగా ముద్రించారన్నారు. ప్రజాశక్తి పత్రిక నిష్పక్షపాతంగా ప్రజా సమస్యలను ప్రచురిస్తూ ప్రజల మన్ననలను పొందుతోందుతోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆరే బాలకృష్ణ, వీఆర్వోలు నరసింహ మూర్తి, గోపాల్, బాలాజీ నాయక్, శృతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.వేల కోట్లతో పారిశ్రామిక అభివృద్ధి

రాయదుర్గం రూరల్ : రూ.వేల కోట్లతో పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నప్పటికీ టిడిపి నాయకులు పారిశ్రామికీకరణ లేదని చెప్పడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి గౌని ఉపేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో శనివారం ఆయన మార్కెట్ యార్డ్ చైర్మన్ భోజరాజు నాయక్ తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆదిత్య బిర్లా సోలార్ హబ్‌తో పాటు మరిన్ని పరిశ్రమలు రూ.వేలాది కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు పరిశ్రమల శాఖ గణాంకలను ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ శ్రీనివాసులు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి పాల్గొన్నారు.

ల్యాండ్ సర్వేయింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉరవకొండ : ఉరవకొండ మండలంలోని చిన్న ముష్టూరు గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆఫీస్ ఆటోమేషన్, ల్యాండ్ సర్వేయింగ్ కోర్సుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ అశ్రాఫ్ ఆలీ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదవ తరగతి ఉత్తీర్ణత అయిన ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 9వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కోర్సులకు ఎంపికైన వారికి కళాశాలలో నాలుగు నెలల పాటు శిక్షణ ఇస్తామని చెప్పారు. రూ.6 వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కోర్సులు పూర్తి చేసుకున్న వారికి రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ శిక్షణ కార్యాలయం వారు పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు మంజూరు చేస్తారన్నారు. ఈ కోర్సును పూర్తి చేసుకున్న వారికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు కళాశాలలోని ఆఫీస్ ఆటోమేషన్ కోఆర్డినేటర్ జి. సురేష్, ల్యాండ్ సర్వేయింగ్ కో ఆర్డినేటర్ పి.రామానాయుడులను సంప్రదించాలని తెలియజేశారు.


ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

పెద్దపప్పూరు : జూటూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్యాధికారి కళ్యాణ్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చిన్న కంబయ్య, హెల్త్ ప్రొవైడర్ సుష్మాలత, ఆరోగ్య కార్యకర్త నగీనా, ఆశా కార్యకర్త రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వీట్స్‌తో సుబ్రమణ్యంస్వామి ప్రతిమ

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక కోర్ట్ రోడ్డులోని ప్రముఖ షిర్డీ సాయి స్వీట్స్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాదిలాగానే ఈ ఏడాది కూడా సుబ్రహ్మణ్యస్వామి ప్రతిమను ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ అధినేత భవానీ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా నుండి ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ..ఐదు రోజులపాటు కష్టపడి ఐదు వెరైటీలలో ఐదు రకాల స్వీట్లు వినియోగించి 50 కేజీల సుబ్రహ్మణ్యంస్వామి ప్రతిమను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.



స్వీట్స్‌తో తయారుచేసిన సుబ్రహ్మణ్యం స్వామి ప్రతిమ

In the court of the Senior Civil Judge Adoni.
E.P.No. 48/2019 in O.S.No.295/2014
Between:
Adiki Hemanth Kukmar. ...Decree-Holder
...Vs...
Gadige Sujatha and another.
...Judgment-debtors.
To:-
1.Gaidge Sujatha wife of Gadige Devendrappa, C/o N.Nagaraj, Superintending Engineer, A.P.S.E.B, Anantapur.
2. Chandra Leela wife of and C/o N. Nagaraj, housewife, Superintending Engineer, Anantapur.
The above named decree - holder has filed the above EP for attachment and sale of the E.P.Schedule property and also attachment of amount of the first J.Dr lying in the Firm Sree Neelakanteswara Filling Station, Yemmiganur against you and the same is posted to 04-01-2023 for your appearance. You are hereby directed to appear in person or through pleader on the aforesaid date at 10-30A.M., failing which you will be set exparte.
Sd/- G.V.Desai,
Advocate for D.Hr.

గడపదాటని చేతలు..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మాటలు కోటలు దాటుతున్నాయి...చేతలు గడపదాటం లేదు.' అన్న విధంగా ఉంది ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల తీరు. సంక్షేమానికి పెద్దపీట వేశామని పాలకులు ఒకవైపు మాటలు చెబుతున్నారు. ఆచరణలో మాత్రం అవి ఏ మేరకు అమలు జరుగుతున్నాయన్నది ప్రశ్నార్థకంగా ఉంది. ఇళ్ల నిర్మాణాల పనితీరు చూస్తే ఇది స్పష్టమవుతోంది. వైసిపి అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో మంజూరైన ఇళ్లు, నిర్మించిన ఇళ్లు చూస్తే ఇది అర్థమవుతుంది. 68 వేల ఇళ్లు అనంతపురం జిల్లా వరకు మంజూరు చేశారు. ఇందులో నిర్మించిన ఇళ్లు చూస్తే కేవలం ఆరు వేలు మాత్రమే పూర్తయ్యాయి. తక్కిన ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. 10 వేల ఇళ్లు అసలు ప్రారంభానికే నోచుకోలేదు. మొత్తం ఇళ్ల నిర్మాణాలు ఎప్పటికి పూర్తవుతాయో కూడా తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఈ ఇళ్ల నిర్మాణాల్లో లోపాలపై సిపిఎం సమరభేరి మోగించింది. పేదల పాదయాత్ర పేరుతో లబ్ధిదారులతో కలిసి మూడు రోజులపాటు ఈ వారంలో పాదయాత్రను నిర్వహించింది. గుత్తి నుంచి అనంతపురం వరకు సాగిన ఈ యాత్రలో అనేక మంది పేదలు పాల్గొన్నారు. ఆఖరి రోజు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాకు వందలాది మంది నిరుపేదలు పాల్గొన్నారు. దీన్ని బట్టి ప్రభుత్వం చెబుతున్న మాటల్లోని డొల్లతనం బహిర్గతమైంది. అనేక సంవత్సరాలుగా ఉంటున్న నిరుపేదలకు ఇళ్లు కాకున్నా కనీసం ఇంటి పట్టా అయినా ఇవ్వాలని ఈ ధర్నాలో డిమాండ్ చేశారు. అనువుగాని చోట స్థలాలు కేటాయించడంతోనే జగనన్న కాలనీల్లో ఇళ్లు కట్టుకోలేకపోతున్నట్టు కూడా సిపిఎం పోరాటం ద్వారా వెల్లడైంది. అనంతపురం నగర శివార్లలోనే కామారుపల్లిలో ఆరు వేల మందికని వేసిన జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం చేపట్టడం వీలుకాదని సాంకేతిక నిపుణులు తేల్చి చెప్పారు. దీంతో ఇక్కడి పట్టాలను అధికారులు రద్దు చేశారు. కొత్తగా ఇళ్ల స్థలాలు కేటాయించలేదు. ఉరవకొండలో ఇళ్ల స్థలాలు శ్మశానానికి పక్కన కేటాయించడంతో లబ్ధిదారులు అక్కడికెళ్లడానికి వెనుకడుగువేస్తున్నారు. ఇతర లేఅవుట్లలోనూ మౌలికసదుపాయలు కల్పించబడలేదు. సిపిఎం జరిపిన ఇళ్ల స్థలాల పోరాటంతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. జనవరి నాలుగో తేదీన లబ్ధిదారులతో ఇళ్ల స్థలాల వద్ద కార్యక్రమాన్ని చేపట్టేందుకు సిద్ధపడ్డారు. దీంతో మరిన్ని అసలు విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. శింగనమలలో కెజిబివి



పాఠశాలలో విద్యార్థినులు రెండవసారి అస్వస్థతకు గురవడం పెద్ద చర్చనీయాంశమైంది. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు దిగువ స్థాయి అధికారులపై చర్యలు తీసుకున్నారు. ఈ వారంతం ఏడాది చివరి వారం కావడంతో నూతన సంవత్సర వేడుకల కోలాహలం అంతటా కనిపించింది. చివరి రోజు అయిన శనివారం నాడు పెద్దఎత్తున నూతన సంవత్సర వేడుకల సంబరాలు అంభరాన్ని అంటాయి. గతేడాదిలాగా ఈ ఏడాది కోవిడ్ భయాలేవీ లేకపోవడంతో దుకాణాల వద్ద కొత్త బట్టల కొనుగోళ్ల సందడి, బేకరీల వద్ద కేకుల కోసం జనం సందడి కనిపించింది.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వైసిపి నాయకుడికి గాయాలు

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని ఎంగిలిబండ గ్రామ సమీపంలోని 67వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచి, వైసీపీ పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్ పీరా తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన వ్యవసాయ పనుల నిమిత్తం ఎంగిలిబండ గ్రామం వద్ద ఉన్న తన తోట వద్దకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా జాతీయ రహదారిపై కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ అతన్ని స్థానికులు చికిత్స నిమిత్తం గుత్తి ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. గాయపడ్డ హుస్సేన్‌పీరాను మాజీ ఎమ్మెల్యే కె. మధుసూదన్ గుప్తా పరామర్శించారు.

ద్విచక్రవాహనం చోరీ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

బొమ్మనహాల్ మండలంలోని దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన షేక్ షఫీ అనే వ్యక్తికి సంబంధించిన ఫ్యాషన్ ప్రో ద్విచక్ర వాహనాన్ని (ఏపీ జీరో టు బీటీ 1374) శనివారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఇంటి ముందు ఉంచిన వాహనం కనపడకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ శివ నివారణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గోపరాజుపల్లిలో మోటారు స్టార్టర్..

పుట్లూరు : మండల పరిధిలోని గోపరాజుపల్లి గ్రామంలో ఓ రైతుకు చెందిన వ్యవసాయ తోటలో మోటారు స్టార్టర్‌ను గుర్తుతెలియని దుండగులు శుక్రవార రాత్రి చోరీ చేశారు. బాధిత రైతు రామ సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని పల్లేపల్లి రైల్వే గేట్ సమీపంలో శనివారం ఉదయం చిదానంద (45) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అధికారులు వివరాలను దర్యాప్తులో తేల్చాల్సి ఉంది.

తహశీల్దారు, ఎస్ఐలపై ప్రయివేటు కేసులు నమోదు

పుట్లూరు : తహశీల్దారు విజయకుమారి, ఎస్ఐలు వెంకటప్రసాద్, మోహన్‌కుమార్ గౌడ్ భూమి విషయంతో తనకు అన్యాయం చేశారని పుట్లూరు మండలం కడవకల్లు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కోర్టుకు వెళ్లారు. కోర్టు ఆదేశాల మేరకు తహశీల్దారు, ఇద్దరు ఎస్ఐలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు



ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగిస్తామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని శ్రీ రామానుజన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరించి రాష్ట్ర కమిటీ సభ్యుడు సి రమేష్ మాట్లాడారు. 53 ఏళ్లలో విద్యార్థి సమస్యలపై అనుక్షణం పోరాటాలను ఎస్ఎఫ్ఐ చేస్తోందని తెలిపారు. విద్యార్థి ఉద్యమ పోరాటాలలో అనేకమంది ఎస్ఎఫ్ఐ నాయకులు అసువులు బాసారని అన్నారు. భారత రాజ్యాంగ విలువల ప్రకారం ప్రతి ఒక్కరికి విద్య అందే వరకు ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ప్రస్తుతం దేశంలో విద్య కాషాయీకరణ, ప్రయివేటీకరణ జరుగుతోందన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం రెండూ విద్యా విధానాన్ని భ్రష్టు పట్టిస్తున్నాయని మండిపడ్డారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ఒక్కరికి ఉచితంగా విద్య అందించాల్సిన ప్రభుత్వాలు కార్పొరేటీకరణ ముసుగులో కార్పొరేట్ విద్యాసంస్థలకు విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ విద్యాసంస్థలను గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల సంక్షేమం ప్రభుత్వాలకు పట్టడంలేదన్నారు. సంక్షేమ హాస్టళ్లలో కల్తీ మరియు నాణ్యత లేని ఆహారం విద్యార్థిలకు అందించి ఆరోగ్యాన్ని పణంగా పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ఒక్కరికి విద్య, నాణ్యమైన భోజన సదుపాయం కల్పించేంతవరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అమరవీరుల స్ఫూర్తితో భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటాలకు శ్రీకారం చుడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గౌతమ నాయక్, కృష్ణ, శివ నాయక్, రాజేష్, వెంకటేష్, రమేష్ నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో ప్రమాద బాధితులను ఆదుకోవాలి

గుంతకల్లు రూరల్ : ఆటో ప్రమాద బాధితులను ఆదుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పొట్టకూటి కోసం కూలి పనుల కోసం వెళ్లి ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబసభ్యులను, క్షతగాత్రులను సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. నాలుగు రోజుల గుత్తి సమీపంలో జరిగిన ఆటో ప్రమాదంలో వైటి.చెరువు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు ఇద్దరు ప్రాణాలు కోల్పోగా 16 మందికి తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. బాధితులు ఆదుకోవడంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహించారన్నారు. స్థానికంగా పనులు లేక పొట్టకూటి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మరణించిన వారి కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, వారు పూర్తిగా కోలుకునే వరకు నిత్యావసర సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు భజంత్రి శ్రీనివాసులు, సిఐటియు మండల కార్యదర్శి కసాపురం రమేష్, నాయకులు బి.తిమ్మప్ప, జగ్గలి రమేష్, రాముడు నాయక్, అబ్దుల్లా, ఓబులేసు, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

పివికెకె ఐటి స్పోర్ట్స్ టెక్ -2 కెలో విద్యార్థుల ప్రతిభ

అనంతపురం : స్థానిక అనంతపురం పివికెకె ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహించిన స్పోర్ట్స్ టెక్ -2కె 22-23లో ఇంటర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సెక్రెటరీ, క్రీడా కౌన్సిల్, జెఎన్‌టియు అనంతపురం జోజీ రెడ్డి చేతుల మీదుగా విజేతలకు బహుమతులను శనివారం ప్రదానం చేశారు. ఈ సంధర్భంగా జోజీ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ విద్యతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడలతో పోటీతత్వం అలవడుతుందన్నారు. కళాశాల ఛైర్మన్ పల్లె కిషోర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడలలో కూడా ప్రగతిని సాధించి దేశ ప్రతిష్టను ప్రపంచ వ్యాప్తంగా పెంచాలని సూచించారు. కోశాధికారి పల్లె సింధూర తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నుంచి వైసిపిలో చేరిక



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న విశ్వ

ప్రజాశక్తి-ఉరవకొండ

విడవనకల్లు మండల కేంద్రంలోని పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు అధికార వైసిపిలో చేరారు. శనివారం ఉరవకొండలోని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి నివాసంలో ఆయన సమక్షంలో టిడిపికి చెందిన 30 కుటుంబాల వారు వైసిపిలో చేరారు. నింబగంటి ఓబులేసు, అది, సురేష్, చంద్రాయుడు, ఆనంద్, గునక నాగరాజు, రామాంజనేయులు, వన్నూరుస్వామి, బాలాంజినేయులు, చంద్ర, రామాంజనేయులు, దాదు, పాల్తూరు మల్లికార్జున తదితరులు విశ్వేశ్వరరెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు వైసిపిలోకి చేరుతున్నారన్నారు. అందరికీ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో విడపనకల్ మండల కన్వీనర్ బసన్న, జెడ్పిటిసి హనుమంతు, మాజీ జెడ్పిటిసి తిప్పయ్య, రాష్ట్ర నాయకులు కరణం భీమరెడ్డి, భరత్‌రెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు సుంకన్న, దేశాయి సిద్దు, గిరిబాబు, పిఏసిఎస్ ఛైర్మన్ శ్రీరాములు, సర్పంచులు జయసింహ, ఉమాశంకర్, ఎంపిటిసి ఓబులేసు, నాయకులు టి.వీరన్న, బెస్త ఎర్రిస్వామి, కన్వీనర్ బ్యాంక్ ఓబులేసు, కురుబ, ఎంబిసి కార్పొరేషన్ల డైరెక్టర్లు గోవిందు, జోగి వెంకటేష్, ఓబన్న, చాబాల నారాయనప్ప, సర్పంచి మల్లెల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపిని ప్రజలు విశ్వసించరు..

నగర మేయర్ మొహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

గతంలో అనంతపురం నగరానికి కానీ నగర ప్రజలకు కానీ మీరు ఏమి చేశారని ప్రజలు మీ వద్దకు వస్తారని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరిని నగర మేయర్ మొహమ్మద్ వసీం ప్రశ్నించారు. నగరంలోని 24వ డివిజన్ పరిధిలో రూ.30 లక్షల వ్యయంతో చేపడుతున్న సిమెంట్ రోడ్డు పనులను మేయర్ వసీం డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయ భాస్కర్ రెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. త్వరితగతిన నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టిడిపి నేతలకు ప్రజలు గుర్తుకు వచ్చారన్నారు. నగరంలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి చేస్తున్న కార్యక్రమానికి ప్రజాస్పందన లేకపోవడంతో ఆనెపాన్ని వైసిపిపైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే తమ కార్యక్రమానికి ప్రజలు ఎవరు రాకూడదని వాలంటీర్లతో అర్బన్ ఎమ్మెల్యే బెదిరిస్తున్నారని అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నగరానికి, ప్రజలకు ఏమి చేయలేదు కాబట్టే ప్రజలు టీడీపీ వారిని విశ్వసించడం లేదన్నారు. టిడిపి నేతలే ప్రభాకర్ చౌదరి వెంట రాలేదన్నారు. మీలో మీకే అంతర్గత కలహాలు ఉన్నాయని మీ పార్టీ నేతలే రానప్పుడు ప్రజలెలా వస్తారని ప్రశ్నించారు. మూడున్నరేళ్ల పాలనలోనే నగరంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో రూ.800 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. నగరంలోని ప్రధాన రహదారుల అభివృద్ధితో పాటు అంతర్గత తహదారులు, బీటీ రోడ్లు, డ్రైయినేజీలను అభివృద్ధి చేశామన్నారు. పింఛన్ల తొలగింపులు జరగడం లేదని కేవలం ప్రతిపక్ష పార్టీల ప్రచారం మాత్రమేనన్నారు. రీ వెరిఫికేషన్



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

ప్రక్రియ మాత్రమే జరుగుతోందని, అర్హులైన వారి పింఛన్లు తొలగించరని మేయర్ స్పష్టం చేశారు. నగరానికి నూతనంగా పింఛన్లు మంజూరు అయ్యాయని వాటిని కూడా ఇళ్ల వద్దకే వెళ్లి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. టిడిపి నాయకులు ఎన్ని జిమిక్కులు చేసినా వారిని ప్రజలు విశ్వసించరన్నారు. మరోమారు వైసిపి ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సంపంగి రామాంజనేయులు, సైపుల్లా బేగ్, కమల్ భూషణ్, ఎస్ఈ నాగమోహన్, మాజీ కార్పొరేటర్ పోతులయ్య, వైసీపీ నాయకులు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, శీనా పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి

టిడిపి బిసిసెల్ అధికార ప్రతినిధి పవన్‌గౌడ్



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు పాలనతోనే ఆంధ్రరాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టిడిపి రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి ఆర్.పవన్ గౌడ్, సీనియర్ నాయకులు ఆర్.హరినాథ్ గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని వన్నెదొడ్డి గ్రామంలో సోమవారం సాయంత్రం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మోదే శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. టిడిపి నాయకులు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ నియంతలా వ్యవహరిస్తున్నారని చెప్పారు. వంటగ్యాస్, పెట్రోలు, విద్యుత్ ఛార్జీలు పెంచడంతో భారాన్ని మోయలేక సామాన్యుల నడ్డి విరుగుతోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ కు ప్రజలు బుద్ధి చెప్పాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు టిడిపిని ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ హరిలు టిడిపిలో చేరారు. వారికి నాయకులు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి మండల, పట్టణ కన్వీనర్లు బర్దివలి, పట్టణ కన్వీనర్ రవిశంకర్ గౌడ్, సర్పంచి భరత్ కుమార్, ఎంపీటీసీ జింకల నారాయణస్వామి, టౌన్ బ్యాంక్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబ్దుల్ జిలానీ, కృష్ణ, నాయకులు దిల్కా శీనా, వేణు, సాంబశివ, మాజీ సర్పంచులు నాగేంద్ర, శ్రీనివాస్ చౌదరి, నరసింహులు, వెంకటరాముడు, మాజీ కౌన్సిలర్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

క్రియాశీల రాజకీయాల్లోకి ఆకుల బాబు

నేడు సన్నిహితులతో సమావేశం

ప్రజాశక్తి-నార్పల



నార్పల మండల కేంద్రానికి చెందిన మాజీ మండలాధ్యక్షులు ఆకుల రామప్ప మనవుడు ఆకుల బాబు (విజయ్ కుమార్) 2023 నూతన సంవత్సరం నుండి క్రియాశీలక రాజకీయాల్లోకి రానున్నట్లు తెలిపారు. శనివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ.. తమ తాత ఆకుల రామప్ప మండలాధ్యక్షునిగా, గ్రామ సర్పంచిగా సేవలు చేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. తమ చిన్నాన్న ఆకుల ఆంజనేయులు సింగిల్‌విండో అధ్యక్షుడిగా, ఎంపీటీసీ సభ్యులుగా, చిన్నమ్మ ఆకుల అరుణమ్మ మండలాధ్యక్షురాలిగా పనిచేశారన్నారు. తన అన్న ఆకుల జయసింహ జెడ్‌పిటిసి సభ్యులుగా, వదిన ఆకుల నాగలలిత నార్పల మేజర్ పంచాయతీ సర్పంచిగా సేవలందించారన్నారు. ఆకుల కుటుంబాన్ని ఇంతగా ఆదరించిన నార్పల మండల ప్రజలు, ఆకుల కుటుంబ సభ్యులు, తమ వర్గీయులకు ఎల్లవేళలా రుణపడి ఉంటామని వినయపూర్వకంగా తెలియజేశారు. కొన్ని వ్యక్తిగత కారణాలవల్ల తాను ఇంతవరకు క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నానన్నారు. తమ కుటుంబాన్ని నమ్ముకొని ఉన్న తమ వర్గీయులకు, గ్రామ ప్రజలకు ఇకపై ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. ప్రజాసేవలో నిమగ్నమై ఉంటానని ఆకుల బాబు వెల్లడించారు. ఆయన నిర్ణయం పట్ల ఆకుల వర్గీయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తన వర్గీయులు, సన్నిహితులతో స్థానిక సెవెన్ హిల్స్ కల్యాణ మండపం (రామకృష్ణ థియేటర్) నందు ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసినట్లు ఆకుల బాబు తెలియజేశారు.

స్వార్థ రాజకీయాలకు మతాన్ని ఉపయోగించడం తగదు

ప్రజాశక్తి-రాయదుర్గం

వ్యక్తిగత ప్రయోజనాలు, స్వార్థ రాజకీయాల కోసం మతాన్ని ఉపయోగించుకోవడం తగదని ముస్లిం మత ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఓ మీడియా చానల్‌లో పనిచేయు విలేకరులపై కాపు రామచంద్రారెడ్డి దాడిచేసే ప్రమాదం ఉందన్నారు. అలా ముస్లిం సామాజిక వర్గానికి చెందిన విలేకరులపై దాడులు జరిగితే వారికి తాము అండగా ఉంటామని కొందరు ముస్లిం ప్రజాప్రతినిధులు శుక్రవారం పోలీస్ ఇన్‌స్పెక్టరుకు వినతిపత్రం ఇవ్వడాన్ని ఖండించారు. రాయదుర్గం మున్సిపల్ వైస్ చైర్మన్ వలీబాషా, మున్సిపల్ వార్డు సభ్యులు షబ్బీర్, ఫక్రుద్దీన్, ముస్లిం ప్రతినిధులు ఇస్మాయిల్, జిలాన్, నజీర్, రఫిక్ తదితరులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులును కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కొందరు వ్యక్తుల స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ముస్లిం మతాన్ని ఉపయోగించి దుర్వినియోగం చేయడం తగదన్నారు. అలాంటి వ్యక్తులకు తమ మతం ఎప్పటికీ అండగా ఉండబోదని స్పష్టం చేశారు. కాలువ శ్రీనివాసులు అతనతికి కొమ్ము కాసే ఏబీఎన్, ఆంధ్రజ్యోతి విలేకరుల ద్వారా కొందరు ముస్లిం ప్రతినిధులను రెచ్చగొట్టి వారిచే పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు ఇప్పించారన్నారు. అలాంటి వాటిని ముస్లిం సామాజిక వర్గం ఆమోదించదని అన్నారు. ఇకపై ఇలాంటి స్వార్థ రాజకీయ చర్యలకు స్వస్తి పలకాలని హితవు పలికారు. విలేకరులపై దాడులు జరగకుండా తగిన రక్షణ కల్పించాలని వారు పోలీసులను కోరారు.

వేసవిలో నీటిఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలి

రాయదుర్గం : వచ్చే వేసవిలో రాయదుర్గం పట్టణంలో నీటి ఎద్దడి రాకుండా ఇప్పటినుండే తగిన చర్యలు చేపట్టాలని రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పోరాలు శిల్ప మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం కౌన్సిల్ హాల్‌లో శిల్ప అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు పద్మజ మాట్లాడుతూ పట్టణంలో అనేకచోట్ల తాగునీటి ఎద్దడి ఉందని స్థానికంగా ఉన్న బోర్లకు మరమ్మతులు చేయడం ద్వారా నీటి ఎద్దడిని నివారించవచ్చని అన్నారు. ఇందుకు స్పందించిన అధ్యక్షులు వేసవిలో నీటి ఎద్దడి నివారణకు బోర్లు మరమ్మతు చేయాలని, మోటార్లను వాడుకకు సిద్ధంగా ఉంచాలని అన్నారు. రెండేళ్ల క్రితం రూ.200 లకే కొళాయి కనెక్షన్లు ఇవ్వనప్పటికీ కొందరు వ్యక్తులకు బిల్లులు చెల్లించాలని నోటీసులు అందినట్లు సభ్యురాలు పద్మజ చెప్పారు. ఈ విషయమై విచారణ జరుపుతామని కమిషనర్ దివాకర్ రెడ్డి తెలిపారు. 28వ వార్డ్ సభ్యులు గోవిందరాజులు మాట్లాడుతూ వట్లకుంట లోపల గల చేపలు మృతి చెంది దుర్వాసన వస్తున్నట్లు చెప్పారు. కూరగాయల మార్కెట్ మొదటి అంతస్తు షాపు రూములు ప్రారంభించి మూడు నెలలైనా ఇంతవరకు బాడుగకు ఇవ్వకపోవడం పురపాలక సంఘానికి నష్టదాయకం అని సభ్యులు బండి అజయ్‌కుమార్ చెప్పారు. త్వరలో వేలంపాటలు నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు. పట్టణంలో ఇటీవల రోడ్డు మరమ్మతులు చేసిన చోట పనులు నాసిరకంగా ఉండటం వల్ల తిరిగి గుంతలు ఏర్పడ్డాయని, పనులు నాణ్యతతో చేపట్టాలని మున్సిపల్ వైస్ ఛైర్మన్ వలీబాషా, సభ్యులు గోవిందరాజులు అధికారులకు సూచించారు. 17వ వార్డు సభ్యురాలు సాబిరబి మాట్లాడుతూ వెంకటేశ్వర కాలనీలో మురుగుకాలువలు నిర్మించాలని కోరారు. కమిషనర్ సమాధానం ఇస్తూ త్వరలో టెండర్లు పిలిచి పనులు చేపడతామని చెప్పారు. అజెండాలోని అన్ని అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. కౌన్సిల్ సభ్యులు, అధికారులు హాజరయ్యారు.

జగన్ రెడ్డి ఆగడాలకు అడ్డుకట్ట వేస్తాం

ప్రజాశక్తి-గుంతకల్లు

సిఎం జగన్‌రెడ్డి అప్రజాస్వామికి విధానాలకు, నిరంకుశ ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ వేదికను ఏర్పాటు చేసినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దేవరగుడి జగదీష్ తెలిపారు. శనివారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 17వ తేదీ నుండి 30 వరకు జగనన్న లబ్ధిదారులతో కమిషనర్, ఎంపీడీవో కార్యాలయంలో అర్జీలు ఇచ్చే కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఫిబ్రవరి 6వ తేదీన లక్ష మంది లబ్ధిదారులతో రాష్ట్రంలో, జిల్లా కేంద్రాలలో సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఫిబ్రవరి 22న విజయవాడలో వేలాదిమంది లబ్ధిదారులతో సదస్సులు నిర్వహించి లబ్ధిదారులకు రూ.ఐదు లక్షల ఇవ్వాలని ఆందోళన చేపడతామన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షణ కోసం విశాఖలో 685 రోజులపాటు దీక్షలు చేపట్టిన వారికి సంఘీభావంగా అన్ని జిల్లాలలో 23, 24 తేదీలలో ఆర్‌డిఒ, రెవెన్యూ కార్యాలయాల వద్ద నిరసన చేపడతామన్నారు. జిల్లాలో 25వ తేది కలెక్టరేట్ దగ్గర దీక్షలు చేపడతామన్నారు. 27న విశాఖపట్నంలో లక్ష మందితో సభ నిర్వహిస్తున్నామన్నారు. నీటిపారుదల ప్రాజెక్టుల విషయంలో నిధులు ఒక్క రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. ఈ విషయంపై నీటిపారుదల పరిశీలనకు ఫిబ్రవరి 8, 14 తేదీలలో రాష్ట్ర బృందం పరిశీలించి బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో పెట్టాలని అందుకు అందరిని కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వెల్లడించారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు పాల్గొన్నారు.